క్లుప్తంగా

మూడు ఆలయాల్లో హుండీల చోరీ

నల్లజర్ల: కొన్ని రోజుల తేడాలో మండలంలోని తెలికిచెర్ల గ్రామంలోని మూడు వేర్వేరు ఆలయాల్లో హుండీ చోరీలు జరిగాయి. ఒక రోజు ఒక ఆలయంలోను, మరో రోజు రెండు ఆలయాల్లోనూ దుండగులు హుండీలను పగలగొట్టి సొమ్ము కాజేయంతో ఆ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ మూడు చోరీలూ ఒకే తరహాలో జన సమ్మర్దం గల ప్రాంతాల్లోనే జరగడం విశేషం. ఏడాదికి ఒకసారి లెక్కించే ముత్యాలమ్మ ఆలయం, అంకాలమ్మ ఆలయాల హుండీలను నాలుగు రోజుల క్రితం దుండగులు పగలగొట్టి సొమ్ము కాజేశారు. అలాగే మంగళవారం రాత్రి మహంకాళమ్మ ఆలయంలోని హుండీని పగలగొట్టి సొత్తు కాజేసినట్టు గ్రామస్తులు గుర్తించారు. హుండీలలోని నగదుతో పాటు అమ్మవారి విగ్రహాల మెడలో ఉన్న రెండు వెండి ఆభరణాలను కూడా దొంగలు తీసుకెళ్లారు. చోరీలు జరిగిన ప్రాంతాలను నల్లజర్ల ఎస్‌ఐ నరసింహమూర్తి బుధవారం పరిశీలించారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాల దగ్ధం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



ఘంటావారిగూడెంలో దగ్ధమైన ఫర్నిచర్, ఇతర సామగ్రి

నల్లజర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని ఘంటావారిగూడెంలో మంగళవారం రాత్రి దొబ్బిడి రవి కుమార్ అనే కౌలు రైతు ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో ఒక గదిలోని ఫర్నిచరు, ఫ్రిజ్, సోఫా, మంచం, టీవీ కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులందరూ మేడపైన పడుకున్నారు. తెల్లవారి లేచి చూసేసరికి సామగ్రి మొత్తం కాలిపోతూ కన్పించాయి. భీమడోలు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆదుపు చేశారు. నష్టం రూ.1.50 లక్షల వరకూ ఉంటుందని అంచనా వేశారు. సచివాలయ వీఆర్వో సునీత ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. వైఎస్సార్ సీపీ నాయకులు యలమర్తి వాసు, తొమ్మండ్రు రమేష్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.1.66 లక్షలు మాయం

కొవ్వూరు: పట్టణానికి చెందిన మానేపల్లి సత్యవాణి అనే మహిళకు చెందిన ఆంధ్రా బ్యాంకు ఖాతా నుంచి రూ.1.66 లక్షల సొమ్ము మాయమైంది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ బుధవారం తెలిపారు. తన బ్యాంకు అకౌంట్‌లో గతేడాది అక్టోబర్ 17న రూ.2,18,077 సొమ్ము ఉండేదని ఆమె పేర్కొన్నారు. ఈనెల 9న చూస్తే కేవలం రూ.70,677 మాత్రమే ఉన్నట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సత్యవాణి వెల్లడించారు. తనకు గూగుల్ పే గానీ, ఫోన్ పే గానీ లేవన్నారు. తాను బ్యాంకు నుంచి సొమ్ము డ్రా చేయలేదన్నారు. తనకు ఏవిధమైన ఓటీపీగానీ మెసేజ్ గానీ రాలేదన్నారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుండి అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కేవీ రమణమూర్తి బుధవారం తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రవేశాలకు జూన్ 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వడదెబ్బకు గురై.. లారీని అదుపు చేయలేక..

దేవరపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయవాడకు చెందిన బలిజేపల్లి శ్రీనివాస్ (57) అనే లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దేవరపల్లి పోలీసుల కథనం ప్రకారం విజయవాడకు చెందిన శ్రీనివాస్ మంగళవారం లారీలో ఎలక్ట్రికల్ సామాన్లు లోడు చేసుకుని రాజమహేంద్రవరం బయలు దేరాడు. జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం బంధపురం వద్దకు వచ్చేసరికి లారీని నడుపుతున్న శ్రీనివాస్ వడదెబ్బకు గురయ్యాడు. ఈ క్రమంలో అతడు లారీని అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీ కొట్టాడు. బలమైన గాయాలైన శ్రీనివాస్‌ను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్సై కె. శ్రీహరిరావు బుధవారం తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి

నిడదవోలు: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని నిడదవోలు అసిస్టెంట్ లేబర్ అధికారి పి.శాంతరాజు తెలిపారు. దుకాణాలు, పరిశ్రమలు, వివిధ సంస్థలు, భవన నిర్మాణాలు చేపడుతున్న యాజమానులు ఇందుకనుగుణంగా తమ సిబ్బంది ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు.

మూగజీవాలు విలవిల

- చాలా పశువులు ఎండలోనే..
- తగ్గిపోయిన పాల దిగుబడి
- కొవ్వూరు నియోజకవర్గంలో 35 వేల పశువులు, మేకలు, గొర్రెలు



పాడి పశువులకు తాళ్లపూడిలోని ఓ రైతు షెడ్డులో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు



ఎండకు తట్టుకోలేక అన్నదేవరపేట వద్ద చెట్టు కిందకు చేరిన గొర్రెలు

తాళ్లపూడి: మండుతున్న ఎండలు, ఊడ్చికొడుతున్న వడగాడ్పులు మనుషులనే కాదు పశుపక్ష్యాదులూ అల్లాడిస్తున్నాయి. ఎండల ధాటికి జనంతో పాటు పశువులు, మేకలు, గొర్రెలు, ఆవుల వంటి మూగజీవాలు సైతం విలవిల్లాడుతున్నాయి. తాళ్లపూడి మండలంలో సుమారు 6 వేల పాడి గేదెలు ఉన్నాయి. అలాగే సుమారు మరో ఆరు వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 35 వేల వరకూ నలుపు, తెలుపు జాతి పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. గ్రామాల్లో చాలాచోట్ల వేసవిలో పశువులను కట్టేందుకు సరైన సదుపాయాలు లేవు. ఎండ నుంచి పశువులకు రక్షణ కల్పించేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. వెసులుబాటు ఉన్న పెద్ద రైతులు మాత్రం పశువులను కొట్టాలలోను, చెట్లకింద కట్టి రక్షణ కల్పించగలుగుతున్నారు. మెజారిటీ రైతులు మాత్రం తమ పశువులను ఎండలోనే ఉంచాల్సి వస్తోంది. మరికొందరు ఎండ తగలకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. రేకుల షెడ్ల కారణంగా మూగజీవాలు మరింత ఇబ్బంది పడుతున్నాయి. వడగాడ్పుల ధాటికి పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. తాగునీటికి కూడా పశువులు ఇబ్బందులు పడుతున్నాయి. అన్నదేవరపేట, సూరయ్యపేట, పోచవరం, రాగోలపల్లి, తుపాకులగూడెం, తిరుగుడుమెట్ట గ్రామాల రైతులు చెరువు నీటిని పశువులకు అందిస్తున్నారు. మేతకు వెళ్లిన సమయంలో వడగాలుల ధాటికి తట్టుకోలేక వగురుస్తున్నాయి.

అవస్థలు పడుతున్నాం



ఎండ, వడగాడ్పుల నుంచి పశువులకు రక్షణ ఏర్పాట్లు చేయడానికి నానా ఇబ్బందులూ పడుతున్నాం. ఎండలకు పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గింది. ఇటీవల పశువుల ధరలు బాగా పెరిగాయి. ఎండ తగలకుండా షెడ్లు కూడా ఏర్పాటు చేశాం
– పనిమిరెడ్డి శ్రీను, పశు పోషకుడు, తాళ్లపూడి

తరచూ నీరు పెడుతూ ఉండాలి



ఎండ బారిన పడకుండా పశువులను ఉదయం పూట మాత్రమే ఆరుబయట మేతకు తీసుకువెళ్లాలి. ఎక్కువసేపు ఎండ తగలకుండా జాగ్రత్తలు వహించాలి. పశువులకు ఎక్కువ సార్లు నీరు పెట్టాలి. తరచూ నీటితో కడుగుతూ ఉండాలి. సాధ్యమైనంతవరకు చల్లని ప్రదేశంలో కట్టాలి.
– బాలాజీ, పశువైద్యాధికారి, అన్నదేవరపేట

ముఖ్యమంత్రిని కలిసిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్



సీఎం జగన్‌తో మట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీలేఖ. చిత్రంలో హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విజయవాడలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితతో పాటు జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు పోసిన శ్రీకృష్ణ దేవరాయలు తదితరులు వెంట ఉన్నారు.

అన్న సమారాధన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం భారీ అన్న సమారాధన జరిగింది. స్వామివారి ఆరాధన ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ కార్యక్రమంనిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వేడి గాలులు.. ఉక్కబోత



నిర్మానుష్యంగా ఉన్న నిడదవోలు- పంగిడి రహదారి

చాగల్లు: మండలంలో బుధవారం కూడా భానుడు ఉగ్రరూపం చూపాడు. మంగళవారంతో పోలిస్తే సూర్యుడు కొంత తగ్గాడు. అయినప్పటికీ బుధవారం ఉదయం నుంచీ వేడిగాలులు వీచాయి. సాయంత్రం ఆరు దాటిన తరువాత కూడా ఈ వేడిగాలులు తగ్గకపోవడంతో ప్రజలు అల్లాడారు. మధ్యాహ్న సమయంలో దుకాణాలను మూసివేశారు. చాలా మంది ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. నాలుగు రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 40 నుంచి 46 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండుతున్న ఎండలతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.రాత్రివేళ కూడా ఉక్కబోత, ఆరాటంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. నిడదవోలు-పంగిడి రహదారిలో రోడ్డు పక్కన పండ్ల రసాలు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ దుకాణాలు ప్రయాణికుల వేసవి తాపాన్ని తీరుస్తున్నారు. మరోవైపు వ్యాపారులకు కూడా మంచి లాభాలను అందిస్తున్నాయి.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు నాలుగో వార్డులో గడపగడపకూ..



ఓ కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని 4వ వార్డు, క్రిస్టియన్‌పేటలో బుధవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన ఆర్థిక లబ్ధి వివరాలను వారికి వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి కనీసం రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ భావన రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు నగళ్లపాటి శ్రీనివాస్, బత్తి నాగరాజు, వరిగేటి సుధాకర్, గుబతాల సురేష్, తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, మాసా ఆనంద్, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, జాలాది రవికుమార్, అంకోలు లిల్లీ వెంకట పద్మలీల, మద్దిపట్ల సాయిగీత, రుద్రం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడమే 'మానవత' లక్ష్యం

- సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి
- దేవరపల్లి మండల శాఖ నూతన భవనం ప్రారంభం



మానవత సంస్థ దేవరపల్లి భవనాన్ని ప్రారంభిస్తున్న కోస్టల్ బ్యాంక్ మేనేజరు శ్రీనివాస్

దేవరపల్లి: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. దాతల సహకారంతో దేవరపల్లిలో కొత్తగా నిర్మించిన మానవత స్వచ్ఛంద సంస్థ భవనాన్ని బుధవారం స్థానిక కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు చీఫ్ మేనేజరు టి. శివనాగేశ్వరరెడ్డి, బ్రాంచి మేనేజరు కేతా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ఎస్. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అందరూ శాంతితో జీవించేలా మనవత సంస్థ శాఖలు పనిచేయాలన్నారు.కుల,మత,వర్గ విభేదాలు లేకుండా సంస్థలోని సభ్యులందరూ కలిసి మెలసి పని చేయాలని సూచించారు. మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ భవన నిర్మాణానికి దాతలు రూ.4.50 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. ఈ మొత్తంలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు యాజమాన్యం రూ.2 లక్షలు అందజేసినట్టు చెప్పారు. సంస్థకు చెందిన చెందిన ఫ్రీజర్, శాంతి రథం భద్రపరచడానికి భవనం లేక ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. స్థానిక ఊర చెరువు గట్టున పంచాయతీ స్థలాన్ని కేటాయించగా, భవన నిర్మాణానికి దాతలు సహకరించినట్టు వివరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, మండల కార్యదర్శి ఈడ్పుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి తీగెల లక్ష్మీనారాయణ, కన్వీనర్ కేశిరాజు రాజ్‌కుమార్, పచ్చా రాంగోపాల్, సంస్థ మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ, పప్పు వెంకట రామారావు, బళ్ల సూర్యచక్రం, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అంజనీ సుతునికి విశేష పూజలు

చాగల్లు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా చాగల్లు అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం, పవిత్ర పుణ్య నదీ జలాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. లక్ష తమలపాకుల పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి 1108 అరటిపండ్లతో పూజలు నిర్వహించారు . కలవలపల్లికి చెందిన అభయాంజనేయ భజన మండలి, చాగల్లుకు చెందిన కేసరి బాలమిత్ర భజన మండలి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.

పొగాకు వేలం కేంద్రం వద్ద ఆర్వో ప్లాంట్



వేలం కేంద్రంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఈడీ శ్రీధర్‌బాబు, దాత మధుమోహన్

గోపాలపురం: స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. తన తండ్రి పిన్నమనేని కృష్ణారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, గోపాలపురం పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, కృష్ణారావు భార్య నిర్మల, కుమారులు వెంకటరావు, సుభాష్ చంద్రబోస్ ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమోహన్ రైతు శ్రేయస్సు కోసం అహర్నిశలూ పనిచేస్తున్న వ్యక్తి అని కొనియాడారు. అనంతరం ఈ పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలం ప్రక్రియను ఆయన పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పొగాకు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎం ఎం. ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి ఎస్‌కే శ్యామ్, ఎస్‌జీఓ కె. హేమస్మిత, రైతు నాయకులు గద్దే శేషగిరిరావు, కరాటం రెడ్డిబాబు, గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, కూసం రామమోహన్‌రెడ్డి, దుగ్గిరాల రాంబాబు, పరిమి జగదీష్ జిల్లాలోని దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అలరించిన సాయిప్రియ నృత్యాంజలి



తిరుపతిలో తన బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న నరుకుల సాయిప్రియ

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామానికి చెందిన కళాకారిణి నరుకుల సాయిప్రియ తన బృందంతో తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. తాళ్లపాక అన్నమాచార్య 614వ జయంత్యోత్సవాల సందర్భంగా సాయిప్రియ నృత్య ప్రదర్శన చేశారు. అన్నమాచార్య రచించిన 'వచ్చేను అలమేలు మంగ', 'వినరో భాగ్యము విష్ణుకథ ', 'గోవింద... గోవింద' రూపకాలను అనుగుణంగా ఆమె బృందం నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సాయిప్రియను ఘనంగా సత్కరించారు.

పంటలను కాపాడుకునేందుకు..



అజ్జరం వద్ద కాలువ నీటిని తోడుతున్న మోటార్లు

పెరవలి: ఎండలు మండిపోతున్నాయి. దాంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. చుట్టుపక్కల బోరు లేకపోవడంతో కాలువలో ఉన్న కొద్దిపాటి నీటిని మోటార్ల సాయంతో తోడి పంటలకు అందిస్తున్నారు. మండలంలోని అజ్జరం, వెంకట్రాయపురం గ్రామాల రైతులు అరటి, కొబ్బరి, కోకో, పంటలను కాపాడుకునేందుకు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. పంట చేల చుట్టూ బోరు లేకపోవడంతో చేలకు దగ్గరలో ఉన్న నరసాపురం కాలువలోని నీటిని ఇంజిన్లతో తోడి పైర్లకు అందిస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఒక ఇంజిన్‌తో తోడి చేలను తడపలేమని భావించిన రైతులు ఏకంగా మూడు ఇంజిన్లు సాయంతో పంటలకు నీటిని అందిస్తున్నారు. ఎండ వేడికి పొలంలో నీరు ఎక్కువ రోజులు ఉండడం లేదు. దాంతో ప్రతి 3 రోజులకు నీటిని అందిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

మురుగు కాలువల ప్రక్షాళనకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: వర్షాకాలంలో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ప్రధాన మురుగు కాలువల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పారు. పట్టణంలోని మాలకోడు నుంచి ఎర్ర కాలువ వరకూ ఇరువైపులా మురుగు కాలువను వెడల్పు చేసే పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ పనుల కోసం మున్సిపల్ సాధారణ నిధులు రూ.రెండు లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గంగుల గోపీయాదవ్, గుర్రం జేమ్స్, అప్సార్ జానీ, కోటేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ మాధవీలత, ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులకు శిక్షణ

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం ఆంగ్ల భాషపై రిటైర్డు ఇంగ్లిస్ ఉపాధ్యాయులు పొన్నా సుబ్రహ్మణ్యం శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి కుంచే చినబాబు మాట్లాడుతూ గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. రచయిత వేదుల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని తోటలకు ఎండ చిచ్చు

- మధ్యలోకి విరిగి పడుతున్న అరటి బొందలు
- పచ్చిమిరప, కంద, కొబ్బరి తోటలకూ నష్టం
- వృథా అవుతున్న రైతుల ప్రయత్నాలు



నల్లాకులవారిపాలెం వద్ద ఎర్రబారుతున్న కొబ్బరి ఆకులు



ముక్కామలలో నిలువునా విరిగిపోతున్న అరటి చెట్లు

పెరవలి: భానుడి భగభగలకు పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా అరటి తోటలు తలలు వాల్చేస్తున్నాయి. మండలంలో 4,500 ఎకరాల్లో అరటిని సాగు చేస్తున్నారు. కాలువలను మూసివేయడంతో బోర్ల సాయంతో రైతులు తోటలకు నీటి తడులు అందిస్తున్నారు. కాలువ కట్టే సమయంలో వాణిజ్య పంటలకు, మెట్ట పంటలకు ఒక నీటి తడి ఇవ్వాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు ఆ నీటిని ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజులుగా వారానికి ఒకసారి బోర్ల సాయంతో అరటి తోటలకు నీటిని అందిస్తున్నారు. అయినప్పటికీ వడగాడ్పులు, భానుడి ప్రతాపానికి ఈ పచ్చని చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. కొన్ని వేడి తీవ్రతను తట్టుకోలేక చెట్లు విరిగిపోతున్నాయి. ఐదు రోజులుగా వీస్తున్న వేడిగాలులకు భూమిలో తేమశాతం తగ్గిపోయింది. దాంతో చూస్తుండగానే అరటి చెట్ల ఆకులు మాడిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్ని విధాలుగా కృషి చేస్తున్నా ఉష్ణోగ్రతలు ముందెన్నడూ లేనంత గరిష్టానికి చేరుకోవడంతో వారి ప్రయత్నాలు ఫలించడం లేదు. పక్వానికి రాకుండానే అరటి గెలలు ముగ్గిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.

మిగతా పంటలదీ అదే పరిస్థితి

ఇప్పటికే వైరస్ సోకడంతో దొండ పందిర్లు ఎండిపోతున్నాయి. ఇప్పుడు ఉష్ణోగ్రతలు బాగా పెరిగాక పచ్చిమిరప తోటలు, కంద, అరటి, కొబ్బరి తోటలు మలమల మాడిపోతున్నాయి. ఎండలు, వడగాడ్పులకు మండలంలోని కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. పచ్చి మిరప తోటలు దిగుబడి వచ్చే సమయంలో ఎండిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, బొక్కావారిపాలెం, ఉమ్మిడివారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో పచ్చిమిరప సాగు చేస్తున్నారు. కందతోటలు కూడా ఉష్ణోగ్రతలకు మాడిపోతున్నాయి. కంద గొడుగులు ఏపుగా వచ్చి భూమిలో దుంప ఏర్పడే సమయంలో ఇలా మొక్కలు మాడిపోవడంతో కంద ఊరిక సక్రమంగా ఉండదని రైతులు వివరిస్తున్నారు.

వేడి గాలుల నుంచి రక్షణ చర్యలు

ఈనిన తోటలకు గెడలు వేయాలి. గెలలకు ఎండి చెత్తను చుట్టాలి. వడగాడ్పులు ఉన్నపుడు గెలలు కోయరాదు. పక్వానికి వస్తే ఉదయమే గెలల కోసి నీడ పాటున ఉంచాలి. వేడి గాలుల నుంచి రక్షణకు తోటల చుట్టూ అవిస మొక్కలను 2 లేక 3 వరసలలో నాటాలి. నీటి తడులు క్రమం తప్పకుండా పెట్టాలి. ప్రతీ 10 రోజులకు ఒకసారి పొటాషియం సల్ఫేట్ (0.05 శాతం) మందును జిగురు మందుతో కలిపి చెట్లు తడిచేలా పిచికారీ చేస్తే ఉష్ణోగ్రతల నుంచి పంటలను కాపాడుకోవచ్చు.
– శ్రీనివాస్, ఉద్యాన అధికారి, కొవ్వూరు